ప్రజల చేతిలో

www.ayudamdaily.com

# ఆయుధం

The Common People's Voice

బుధవారం | అక్టోబరు 07, 2026 | సంపుటి : 7 | సంచిక : 108 | పేజీలు : 2



2 లో

# శివనగర్‌పై ఇంత నిర్లక్ష్యమా..?

- ఎమ్మెల్యేలు.. మంత్రులకు మా గోస పట్టదా..?
- మీకు ఓట్లు.. మాకు పాట్లా..
- మేము ముంపులోనే ఉండాలా..
- ఖబడ్దార్ పాలకులరా..
- ఆరేళ్ళయినా మా బాధ చూడరా..
- డ్రైనేజ్ పనులు పూర్తి చేయకుంటే మున్సిపాలిటీ కార్యాలయం, ఎమ్మెల్యే ఇల్లు ముట్టడిస్తాం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- రోడ్డుపై కల్లాపి జల్లి బిజెపి వినూత్న నిరసన!

మాపై ఇంత నిర్లక్ష్యమా.. ఆరేళ్లు అయినా మా గోస పట్టదా.. ఇంకెన్నాళ్లు సహించాలి.. అసలు వరంగల్ లో ప్రభుత్వ పాలన ఉందా అంటూ బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శివనగర్ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనుల్లో ప్రభుత్వాల నిర్లక్ష్యం, అధికారుల జాప్యానికి నిరసనగా మంగళవారం శివనగర్ మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో శివనగర్‌లో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. డ్రైనేజ్ గుంతలతో అధ్వాన్నంగా మారిన రోడ్డుపై అలుకు నీళ్లు జల్లుతూ, ప్రభుత్వాల మొద్దు నిద్రను నిరసిస్తూ బిజెపి శ్రేణులు ఆందోళన చేపట్టారు.

– వరంగల్, ఆయుధం

## భారత వైమానికదళం కొత్త అధిపతిగా

# అశుతోష్ దీక్షిత్

- వైమానికదళంలో 4 దశాబ్దాలుగా అశుతోష్ దీక్షిత్ సేవలు
- ఈనెల 31 బాధ్యతలు స్వీకరణ



**జాతీయం, ఆయుధం:** భారత వాయుసేనకు తదుపరి అధిపతిగా ఎయిర్ మార్షల్ ఆశుతోష్ దీక్షిత్ నియమితులయ్యారు. ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్‌గా సేవలందిస్తున్న ఆయన, వాయుసేన 29వ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. అక్టోబర్ 31 ప్రస్తుత ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ పదవీ విరమణ చేయనున్నారు. అదే రోజున నూతన ఎయిర్ చీఫ్‌గా ఆశుతోష్ దీక్షిత్ బాధ్యతలు చేపట్టనున్నారు.

**దాదాపు 40 ఏళ్ల సేవ**

ఎయిర్ మార్షల్ ఆశుతోష్ దీక్షిత్ వాయుసేనలో దాదాపు నాలుగు దశాబ్దాల అనుభవం కలిగిన సీనియర్ ఫైటర్ పైలట్. 1966 డిసెంబర్ 9న జన్మించిన దీక్షిత్ 1986 డిసెంబర్ 6న భారత వాయుసేన ఫైటర్ స్ట్రీమ్‌లో చేరారు. అప్పటి నుంచి వివిధ కీలక హోదాల్లో సేవలందించిన ఆయనకు ఆపరేషనల్, శిక్షణ, విధాన రూపకల్పన, విమాన పరీక్షలు, వ్యూహాత్మక ప్రణాళిక వంటి విభాగాల్లో విస్తృత అనుభవం ఉంది. ఆయన ప్రయాణంలో ఫైటర్ పైలట్‌గా మాత్రమే కాకుండా ప్రయోగాత్మక టెస్ట్ పైలట్, ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా కూడా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఎయిర్ మార్షల్ దీక్షిత్‌కు 3,500 గంటలకు పైగా విమాన ప్రయాణ చేశారు. అలాగే భారత వాయుసేనలోని పలు కీలక యుద్ధ, శిక్షణ విమానాలను నడిపిన అనుభవం కూడా ఉంది. మిరాజ్ 2000, వివిధ మిగ్ సిరీస్ విమానాలు, కిరణ్, జాగ్వార్, ఐఎల్ 78, హాక్‌తో పాటు స్వదేశీ తేజస్‌లోనూ ఆయన ప్రయాణించారు.

## సర్.. అభ్యంతరాలు, క్లెయిమ్‌ల

# నేటితో గడువు పూర్తి

**హైదరాబాద్, ఆయుధం:** తెలంగాణలో ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియలో మరో దశ బుధవారంతో ముగియనుంది. అభ్యంతరాలు, క్లెయిమ్‌ల దరఖాస్తులకు బుధవారమే చివరి రోజు. ఆగస్టు 17న ముసాయిదా జాబితా ప్రకటించిన ఎన్నికల కమిషన్.. అదే రోజు నుంచి అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరిస్తోంది. ఎన్యుమరేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 73.39లక్షల ఓట్లు పోయాయి. వాటిపై ఇవాళ్టి వరకు రాష్ట్రవ్యాప్తంగా 7,56,180 అభ్యంతరాలు, క్లెయిమ్‌లు వచ్చినట్లు సీఈవో కార్యాలయం తెలిపింది. అందులో క్యూర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల నుంచే 4,64,685 ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువగా ఫామ్ 6లే వచ్చాయి. కొత్తగా ఓటు కోసం 4,40,942 మంది దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఫామ్7తో పాటు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు 7,56,180 రాగా.. పరిష్కరించనవి కేవలం 41,776 మాత్రమే. మిగతా 7,14,401 దరఖాస్తులు ఇంకా విచారణ దశలోనే ఉన్నాయి. అభ్యంతరాలు, క్లెయిమ్‌ల పరిష్కారానికి నవంబరు 5 వరకు గడువు ఉంది. మరోవైపు నోటీసుల ప్రక్రియ కొనసాగుతోంది. నవంబరు 11 వరకు నోటీసుల జారీ, హియరింగ్ ప్రక్రియ పూర్తి చేసి.. నవంబరు 9న తుది ఓటరు జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించనుంది.

## నేడు రూ.300 ప్రత్యేక ప్రవేశ

# దర్శన టికెట్లు విడుదల



**తిరుమల, ఆయుధం:** శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో అక్టోబర్ 12, 13, 14, 18, 19, 20వ తేదీలకు సంబంధించిన రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను అక్టోబర్ 7న బుధవారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది. భక్తులు ఈ టికెట్లను https://ttdevasthanams.ap.gov.in ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. అక్టోబర్ 11 నుంచి 20 వరకు వీఐపీ బ్రేక్, ప్రివిలేజ్డ్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు తెలిపింది. అక్టోబర్ 11 నుంచి 20 వరకు తిరుమలలో శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలతో పాటు పెరటాసి మాసం చివరి వారం కావడంతో భక్తుల అధిక రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ 10 రోజుల పాటు ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్, వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు, ఎన్ఆర్ఐ, డిఫెన్స్ దర్శనాలను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. వీఐపీ బ్రేక్ దర్శనాలకు సంబంధించి అక్టోబర్ 10 నుంచి 19 వరకు వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించబోమని తెలిపారు.



# దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలకు రండి

- బల్దియా కమిషనర్‌కు ఆహ్వానం

**వరంగల్, ఆయుధం:** భద్రకాళి దేవాలయంలో ఈ నెల 11 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఆలయ కార్యనిర్వహణ అధికారి సునీత, ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు మంగళవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టీ. వెంకన్నను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, కల్యాణోత్సవం, ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.





# ప్రతీ బుక్ డిజిటలైజేషన్ కావాలి

- నిర్వహణ సరిగ్గా ఉండాలి
- డిజిటల్ లైబ్రరీ సేవలు ఉండాలి
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ, ఆయుధం:** పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువతి యువకులకు సాధారణ పాఠకులకు మెరుగైన వసతులు కల్పించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. మంగళవారం స్థానిక సెంట్రల్ లైబ్రరీ ని కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సందర్శించారు. ఈ సందర్భంగా పూర్తి అయిన రీడింగ్ హాల్ పనులను కలెక్టర్ పరిశీలించి... అందులో కావాలిసిన మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లైబ్రరీ లో ఉన్న పుస్తకాల నిర్వహణ ని, ఇంటర్ నెట్ సెక్షన్ ని అలాగే మిషన్ ద్వారా పుస్తకాలను తీసుకునే విధానాన్ని, లైబ్రరీ పరిసరాలను పరిశీలించారు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న యువతి, యువకులతో కలెక్టర్ మాట్లాడి... ఎక్కడ (మిగతా 2 లో..)

## మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్‌రెడ్డికి

# మాజీ ఎమ్మెల్యే వన్నాల ఘన సన్మానం

- బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో మర్యాదపూర్వక భేటీ
- 1984–89 నాటి అసెంబ్లీ జ్ఞాపకాలు, ఛలోక్తులను నెమరువేసుకున్న ఇరువురు
- జర్నలిస్టుల సంక్షేమానికి మరింత కృషి చేస్తారని ఆశాభావం



**హైదరాబాద్, ఆయుధం:** తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా సీనియర్ సంపాదకులు కే.శ్రీనివాస్ రెడ్డి రెండోసారి నియమితులైన సందర్భంగా వర్ధన్నపేట మాజీ శాసనసభ్యులు వన్నాల శ్రీరాములు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన ఈ భేటీలో కే. శ్రీనివాస్ రెడ్డిని శ్రీరాములు శాలువాతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య సుదీర్ఘకాల అనుబంధం, గత స్మృతులు ప్రస్తావనకు వచ్చాయి. 1984 నుంచి 1989 వరకు వన్నాల శ్రీరాములు శాసనసభ్యుడిగా కొనసాగిన కాలంలో, కే. శ్రీనివాస్ రెడ్డి అసెంబ్లీ న్యూస్ కవరేజ్ సంపాదకులుగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ కాలంలో అసెంబ్లీ సమావేశాలు జరిగిన తీరు, సభా వేదికగా నాయకుల మధ్య సాగిన ఆసక్తికర చర్చలు, చోటుచేసుకున్న చతురోక్తులు, హుందాతనంతో కూడిన రాజకీయ వాతావరణాన్ని ఇరువురు కొద్దిసేపు ఆప్యాయంగా నెమరువేసుకున్నారు. అనంతరం వన్నాల శ్రీరాములు మాట్లాడుతూ... అనుభవజ్ఞులైన కే. శ్రీనివాస్ రెడ్డి వరుసగా రెండోసారి తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం పాత్రికేయ రంగానికి ఎంతో శుభపరిణామమని హర్షం వ్యక్తం చేశారు. గతంలోనూ జర్నలిస్టుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన ఆయన, రాబోయే రోజుల్లోనూ వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమానికి, వారి హక్కుల పరిరక్షణకు, సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆన్‌లైన్ మీడియా వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి, 'ఢీంబాయ్ టీవీ' సీఈవో వేముల సదానందం నేత పాల్గొని కే.శ్రీనివాస్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

## మాజీ మంత్రి మేచినేని కిషన్ రావుకు పరామర్శ!



**హైదరాబాద్, ఆయుధం:** సికింద్రాబాద్ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మేచినేని కిషన్ రావు (86) ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ఆయన ఎడమ చేతికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయం తెలిసిన వెంటనే వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు మంగళవారం హైదరాబాద్‌లోని కిషన్ రావు నివాసానికి వెళ్లి ఆయన్ను ఆత్మీయంగా పరామర్శించారు. ఆయనతో పాటు తెలంగాణ ఆన్‌లైన్ మీడియా వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి, 'ఢీంబాయ్ టీవీ' సీఈవో వేముల సదానందం నేత కూడా మేచినేని కిషన్ రావును కలిసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నేతల మధ్య పూర్వ వరంగల్ జిల్లా రాజకీయాలతో పాటు తాజా రాజకీయ పరిణామాలపై ఆసక్తికర చర్చ సాగింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) క్షేత్రస్థాయి బలోపేతం, పార్టీ ప్రస్తుత పరిస్థితి గురించి మేచినేని కిషన్ రావు ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు.

## బతుకమ్మ, దసరా ఉత్సవాలకు

# పటిష్ట ఏర్పాట్లు చేయాలి

- ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ



**వరంగల్, ఆయుధం:** దసరా, సద్దుల బతుకమ్మ పండగలకు పెద్ద సంఖ్యలో ప్రజలు, మహిళలు, భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని కొండా సురేఖ సూచించారు. రంగలీల మైదానం, ఉర్సు గుట్ట, కరీమాబాద్, ఉర్సు ప్రాంతంలో నిర్వహించనున్న దసరా ఉత్సవాలు, రావణ వధ కార్యక్రమం మరియు సద్దుల బతుకమ్మ పండగ ఏర్పాట్లపై మాజీ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనే నేపథ్యంలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు, బారికేడింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, మరుగుదొడ్లు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. బతుకమ్మ నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో కూడా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి, మహిళలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. రావణ వధ కార్యక్రమానికి భారీగా ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, విద్యుత్ తీగలు, తాత్కాలిక కనెక్షన్లు, లైటింగ్ వ్యవస్థలను ముందుగానే పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని ఆదేశించారు. ఉత్సవ ప్రాంగణంలో నిరంతర తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ, వైద్య సదుపాయాలు, అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. ప్రజల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, ప్రవేశ-నిష్క్రమణ మార్గాలు, అత్యవసర మార్గాలు ముందుగానే గుర్తించి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు. జన సమ్మర్థం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల భద్రతే మొదటి ప్రాధాన్యతగా అధికారులు పనిచేయాలని, ఏ చిన్న లోపం కూడా పండగ సమయంలో ప్రజలకు ఇబ్బందిగా మారకుండా ముందుగానే గుర్తించి పరిష్కరించాలని కొండా సురేఖ స్పష్టం చేశారు. కార్యక్రమాల నిర్వహణ పూర్తయ్యే వరకు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సద్దుల బతుకమ్మను తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటారని, మహిళలు, చిన్నారులు, వృద్ధులు సురక్షితంగా పండగలో పాల్గొనేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయడం అధికారుల బాధ్యత అని కొండా సురేఖ అన్నారు. దసరా, సద్దుల బతుకమ్మ ఉత్సవాలను ప్రజలందరూ ఆనందంగా, ప్రశాంతంగా, సురక్షితంగా జరుపుకునేలా ఎటువంటి లోటుపాట్లకు అవకాశం లేకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ సత్య శారద, పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, మున్సిపల్ కమిషనర్ టి. వెంకన్న, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్, ఉత్సవ కమిటీ సభ్యులు, నాగపురి సంజయ్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలి

- ఆర్టీసీ ఎన్నికల ప్రచారంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి

**పరకాల, ఆయుధం:** పరకాల ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడబ్ల్యూయూ-ఎస్‌డబ్ల్యూఎఫ్ ఐక్య కూటమి అభ్యర్థుల తరఫున పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. రీజియన్ క్లాస్ సీరియల్ నెంబర్ 6, స్టేట్ క్లాస్ సీరియల్ నెంబర్ 3 బాణం గుర్తుపై ఓటు వేసి ఐక్య కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆర్టీసీ కార్మికులను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్న ఐక్య కూటమి అభ్యర్థులకు ప్రతి ఒక్క కార్మికుడు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా పనిచేస్తోందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు ఆర్టీసీ కార్మికుల ఎన్నికలను అడ్డుకుని, వారి సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు ప్రజాస్వామ్య హక్కులు కల్పిస్తూ, వారి సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు సాగుతోందని అన్నారు. ఆర్టీసీ కార్మికులు ఐక్యంగా నిలిచి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి మద్దతుగా, టీడబ్ల్యూయూ-ఎస్‌డబ్ల్యూఎఫ్ ఐక్య కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.



# పంటకోత ప్రయోగాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలి

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ, ఆయుధం:** పంటల దిగుబడి అంచనా కోసం నిర్వహించే పంటకోత ప్రయోగాలను నిర్దేశిత శాస్త్రీయ పద్ధతిలో, కచ్చితత్వంతో నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా ప్రణాళిక, వ్యవసాయ శాఖల క్షేత్రస్థాయి అధికారులకు పంటకోత ప్రయోగాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ పంటకోత ప్రయోగాల ద్వారా సేకరించే దిగుబడి వివరాలు ప్రభుత్వం తీసుకునే అనేక కీలక విధానపరమైన నిర్ణయాలకు ఆధారంగా ఉంటాయని తెలిపారు. కనీస మద్దతు ధర నిర్ణయం, ధాన్యం సేకరణ, ఆహార భద్రత, పంటల బీమా, ఎగుమతి-దిగుమతి విధానం, ద్రవ్యోల్బణ నియంత్రణ తదితర అంశాల్లో ఈ వివరాలు కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పంటకోత ప్రయోగాల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, క్షేత్రస్థాయిలో ప్రతి ప్రయోగాన్ని నిర్దేశిత నిబంధనలు, శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. సేకరించే దిగుబడి వివరాలు కచ్చితంగా, నాణ్యంగా ఉండేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి బి. సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 100 వరి, 20 మొక్కజొన్న, 60 పత్తి, 10 ఎండు మిరప పంటకోత ప్రయోగాలను నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి వి. విజయ్ చంద్ర మాట్లాడారు. ఈ శిక్షణ కార్యక్రమంలో హన్మకొండ, పరకాల డివిజన్ల వ్యవసాయ సహాయ సంచాలకులు, ప్రణాళిక శాఖ గణాంక అధికారి, మండల వ్యవసాయ అధికారులు, ఉప గణాంక అధికారులు, పాల్గొన్నారు.

# ప్రతీ బుక్ డిజిటలైజేషన్ కావాలి

(మొదటి పేజీ తరువాయి..)
నుండి వచ్చారు, దేనికి ప్రిపేర్ అవుతున్నారు అని తదితర వివరాలని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... అన్నీ రీడింగ్ రూముల్లో తగిన వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలకు, ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం అవసరమైన తాజా స్టడీ మెటీరియల్, పుస్తకాలను అందుబాటులో ఉంచాలాన్నారు. అలాగే పుస్తకాల నిర్వహణ సరిగ్గా ఉండాలని, ఏ పుస్తకం ఎక్కడ ఉందో స్పష్టంగా తెలియాలన్నారు. ప్రతీ పుస్తకాన్ని డిజిటలైజేషన్ చేయాలన్నారు. లైబ్రరీ ప్రాంగణాలను, పుస్తకాల అల్మారాలను నిరంతరం శుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం డైట్ కాలేజ్ ఆవరణలో నిర్మాణం చేపట్టిన యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ పనులను కలెక్టర్ పరిశీలించి.. సంబంధిత అధికారులకు పలు సూచనలను తెలియజేశారు. ఈ పరిశీలనలో లైబ్రరీ సెక్రటరీ సరితా, తెలంగాణ విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ డీఈ, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

# రెండు రోజుల పాటు నీటి సరఫరాకు అంతరాయం

**వరంగల్, ఆయుధం:** పైప్‌లైన్ లీకేజీ కారణంగా మడికొండ రైల్వే ట్రాక్ సమీపంలో మరమ్మతు పనులు చేపట్ట నున్న నేపథ్యంలో 60 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (WTP) నుంచి నీటి సరఫరాను బుధ, గురువారం) రెండు రోజుల పాటు నిలిపివేయడం లేదా అంతరాయం కలిగే అవకాశం ఉందని జిడబ్ల్యూఎంసీ సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్ కుమార్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో పరకాల, వర్ధన్నపేట, ఘన్‌పూర్, వరంగల్ తూర్పు నియోజకవర్గాల పరిధిలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాపై ప్రభావం పడనుంది.

**ప్రభావిత ప్రాంతాలు:**

పరకాల నియోజకవర్గంలోని స్తంభంపల్లి, వసంతాపూర్, దుప్పకుంట, గాడెపల్లి, బొల్లికుంట. వర్ధన్నపేట నియోజకవర్గంలోని నక్కలపల్లి, ఆలీపూర్, జక్కలోద్ది, అమ్మవారిపేట, బట్టుపల్లి, కడిపికొండ, రాంపేట, కుమ్మరిగూడెం, అయోధ్యాపురం, తారాలపల్లి, మడికొండ, బాలాజీనగర్, దేవన్నపేట, ఎల్లాపూర్, మునిపల్లి, ఘన్‌పూర్ నియోజకవర్గంలోని రాంపూర్, ఉనికిచర్ల, టేకులగూడెం, వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని శివనగర్, పుప్పాలగుట్ట, చింతల్, ఫోర్ట్ వరంగల్, శంభునిపేట, రంగశాయిపేట, సుభాష్‌నగర్, కరీమాబాద్, పెరుకవాడ, మిల్స్ కాలనీ, బీరన్నకుంటలో నీటి సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. మరమ్మతు పనులు పూర్తయిన అనంతరం నీటి సరఫరాను పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. ప్రభావిత ప్రాంతాల ప్రజలు రెండు రోజుల పాటు నీటిని ముందుగానే నిల్వ చేసుకోవాలని ఆయన సూచించారు.



# భూముల రీసర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి

- రోజువారీ లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టాలి
- జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి

**హనుమకొండ, ఆయుధం:** భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయిలో సర్వేను మరింత ముమ్మరం చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి సర్వేయర్లు, అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం కోతుల నడుమ, హనుమకొండ మండలం పలివేల్పులలో కొనసాగుతున్న భూ రీసర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే పనుల పురోగతి, ఇప్పటివరకు పూర్తయిన భూముల కొలతలు, క్షేత్రస్థాయిలోని వివిధ అంశాలను గురించి సర్వేయర్లు, అధికారులను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇరు గ్రామాల రైతులతో భూముల రీ సర్వే జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ.. ప్రతిరోజూ 70 ఎకరాల కొలత లక్ష్యంగా నిర్దేశించుకుని భూముల కొలతలను సర్వేయర్లు పూర్తి చేయాలన్నారు. భూముల రీ సర్వేలో భాగంగా రెండు రోవర్లను వినియోగిస్తూ సర్వే పనులను వేగవంతం చేయాలని సూచించారు. సర్వే బృందాలు ఉదయం 9 గంటలలోపే క్షేత్రస్థాయికి చేరుకుని రోజువారీ లక్ష్యాన్ని పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. మరుసటి రోజు చేపట్టే సర్వే సమాచారాన్ని ముందస్తుగా సంబంధిత రైతులకు తెలియజేయాలన్నారు. గడువులోగా రీసర్వే ప్రక్రియను పూర్తి చేసేలా అధికారులు, సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, భూముల కొలతల శాఖ ఏడీ నూర్ సింగ్, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఎల్కతుర్తి నాయబ్ తహసీల్దార్ రమేశ్, సర్వేయర్లు, ఆర్ఐలు, స్థానిక రైతులు పాల్గొన్నారు.



# కేయూ కే-హబ్ అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**హనుమకొండ, ఆయుధం:** కాకతీయ విశ్వవిద్యాలయంలోని కేహబ్‌లో TGEWIDC ఆధ్వర్యంలో, RUSA 2.0 నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పనుల పురోగతిని సమీక్షించి, వాటిని వేగవంతంగా పూర్తి చేసేందుకు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం కు పలు సూచనలు చేసారు. కేయూ కేహబ్ ద్వారా ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రిజిస్ట్రార్ తెలిపారు.
కాకతీయ విశ్వవిద్యాలయం కేహబ్ మరియు THub, హైదరాబాద్ మధ్య కుదిరిన అవగాహనా ఒప్పందంలో భాగంగా విద్యార్థులు, యువ ఔత్సాహికులకు మెంటరింగ్ అందిస్తున్నామని పేర్కొన్నారు. అంకుర సంస్థల స్థాపనకు



ప్రోత్సాహం అందిస్తూ ఉత్తర తెలంగాణలో ఒక ప్రముఖ ఇన్నోవేషన్, స్టార్టప్ కేంద్రంగా కేహబ్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఆయన తెలిపారు. త్వరలో దేశంలోనే అతి పెద్ద హ్యాకథాన్ కు కాకతీయ యూనివర్సిటీ వేదికగా నిలవనుందని రిజిస్ట్రార్ వెల్లడించారు. ఈ పరిశీలనలో RUSA నోడల్ అధికారి ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి, కేహబ్ డైరెక్టర్ ఆచార్య టి. సవితా జ్యోత్స్న, అభివృద్ధి అధికారి ఆచార్య వై. వెంకయ్య తదితర అధికారులు ఉన్నారు.

# శివనగర్ పై ఇంత నిర్లక్ష్యమా?

- ఎమ్మెల్యే లు.. మంత్రులకు మా గోస పట్టదా.?
- మీకు ఓట్లు.. మాకు పాట్లా..
- మేము ముంపులోనే ఉండాలా..
- ఖబడ్దార్ పాలకులరా..
- ఆరేళ్ళయినా మా బాధ చూడరా..
- డ్రైనేజ్ పనులు పూర్తి చేయకుంటే మున్సిపాలిటీ కార్యాలయం, ఎమ్మెల్యే ఇల్లు ముట్టడిస్తాం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- రోడ్డుపై కల్లాపి జల్లి బిజెపి వినూత్న నిరసన!



**వరంగల్, ఆయుధం:** మాపై ఇంత నిర్లక్ష్యమా.. ఆరేళ్లు అయినా మా గోస పట్టదా.. ఇంకెన్నాళ్లు సహించాలి.. అసలు వరంగల్ లో ప్రభుత్వ పాలన ఉందా అంటూ బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శివనగర్ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనుల్లో ప్రభుత్వాల నిర్లక్ష్యం, అధికారుల జాప్యానికి నిరసనగా మంగళవారం శివనగర్ మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో శివనగర్‌లో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. డ్రైనేజ్ గుంతలతో అధ్వాన్నంగా మారిన రోడ్డుపై అలుకు నీళ్లు జల్లుతూ, ప్రభుత్వాల మొద్దు నిద్రను నిరసిస్తూ బిజెపి శ్రేణులు ఆందోళన చేపట్టారు. గంట రవికుమార్ మాట్లాడుతూ ''ఎమ్మెల్యే లు.. మంత్రులకు మా గోస పట్టదా.. శివనగర్ అంటే ఎందుకు ఇంత వివక్ష.. మీకు ఓట్లు.. మాకు పాట్లా.. మేము ముంపులోనే ఉండాలా.. వానొస్తే నీటిలో మునగాలా.. ఖబడ్దార్ పాలకులరా'' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎమ్మెల్యే.. ప్రస్తుత ఎమ్మెల్యే ఇద్దరు.. ఇద్దరే అంటూ ధ్వజమెత్తారు. వారికి ఓట్లు తప్ప మన గోస పట్టదని మండి పడ్డారు. మన సమస్యలపై మనమే యుద్ధం చేయాలని.. ప్రజల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం ముమ్మరం చేస్తుందని గంట రవికుమార్ స్పష్టం చేశారు. శివనగర్ డ్రైనేజ్ పనుల ఆలస్యం స్థానిక ప్రజలకు శాపంగా మారిందని మండిపడ్డారు. దాదాపు రూ. 75 కోట్ల రూపాయల భారీ నిధులు వెచ్చించినప్పటికీ, పనులు నాలుగేళ్లుగా నత్తనడకన సాగడం వెనుక పాలకుల, అధికారుల చేతకానితనమే కారణమని ధ్వజమెత్తారు. నాలుగు నెలల క్రిందట మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి అధికారులతో కలిసి ఇదే రోడ్డుపై స్వయంగా సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారనీ, పది రోజుల్లోనే పనులన్నీ పూర్తి చేసి, ఈ రోడ్డును ప్రజల వాడకానికి ప్రారంభిస్తామని చెప్పి ఏళ్ళు గడుస్తున్నా పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. అయినా వారి పార్టీలో.. వారి పదవులకే దిక్కు లేదని.. ఇక మన సమస్యలన్ని ఎక్కడ పట్టించుకుంటారని ఎద్దేవా చేశారు. మాట తప్పడం కొండా దంపతులకు తెలియదని గొప్పలు చెప్పు వారు.. శివనగర్ డ్రెయినేజీ పనుల జాప్యంపై ఇచ్చిన హామీ పై ఇంకెప్పుడు స్పందిస్తారనీ మండి పడ్డారు. పనుల్లో సర్కారు కక్షపూరిత వైఖరితో శివనగర్ ప్రజలకు శాపంగా మారిందని గంట ఆరోపించారు. కంపు అనుభవించాల్సి వస్తోందని, నిత్యం డ్రైనేజ్ గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యేకు పట్టడం లేదని విమర్శించారు. పదవులు మీవి... కష్టాలు మావా? శివనగర్ డ్రైనేజ్ పనులపై ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి అని రవి కుమార్ డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం హామీలకే పరిమితమయ్యాయని, క్షేత్రస్థాయిలో అభివృద్ధి శూన్యమని మండిపడ్డారు.

ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శిలు వైట్ల గణేష్, సూర శ్రీనివాస్, బిజెపి నాయకులు ఆడెపు వెంకటేష్, శ్యాంసుందర్, ఉషారాణి, శ్రీనివాస్, సుజాత, స్రవంతి, వెంకన్న, ప్రభాకర్, నవీన్, దేవక్క, కన్వీనర్లు సతీష్, శివశంకర్, సాగరిక, రమేష్, సూరజ్, బిజెపి జిల్లా పదాధికారులు బన్న ప్రభాకర్, గడల కుమార్, బైరి నాగరాజు, జనార్దన్, వివిధ జిల్లా మోర్చా అధ్యక్షులు మాదాసు రాజు, క్రాంతి కుమార్, రవీందర్, షేర్ల అనిల్, మోహనాచారి, వీరస్వామి, సాయి, చంద్రమోహన్, సతీష్ కట్టర్, శ్రీనివాస్, శివ ప్రసాద్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఫేజ్–2లో పరకాల ప్రథమ స్థానం

- బీఎల్ఏలు, బీఎల్ఓలకు, కాంగ్రెస్ శ్రేణులకు అభినందనలు
- గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు విస్తృతంగా చేపట్టాలి
- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**హనుమకొండ, ఆయుధం:** ఎస్ ఐ ఆర్ ఫేస్2 ప్రక్రియలో పరకాల నియోజకవర్గంలో ఓటర్ జాబితా ప్రక్షాళన కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్నామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ భవన్ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సహకరించిన బిఎల్ఎలు, బిఎల్ఓ లు, క్లస్టర్ ఇంచార్జిలు, మండల, పట్టణ, డివిజన్ అధ్యక్షులకు, కౌన్సిలర్లు, సర్పంచులు, గ్రామ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఎస్ఐఆర్ ఫేజ్ 1 ప్రక్రియలో రాష్ట్రంలో 2 వ స్థానం సాధించామన్నారు. మీ కృషివల్లే పరకాల నియోజకవర్గంలో 41 వేలు 945 నోటీసులను పరిష్కారం చేసి, అర్హులను కాపాడగలిగామన్నారు. ప్రతి ఓటును కాపాడుకోవడం ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడమేనని, ఓటు హక్కు లేని వారిని గుర్తించి కొత్త ఓటర్ నమోదు చేసేలా ప్రోత్సహించాలన్నారు. వరంగల్, నల్గొండ, ఖమ్మం ఎమ్మెల్సీ ఎన్నికలకు గ్రాడ్యుయేట్స్ ఓటర్ల నమోదు కార్యక్రమం చేపట్టుటపై చర్చించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు. 2024 ఎమ్మెల్సీ ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం లో 14,822 ఓట్లు ఉన్నాయన్నారు. పరకాల టౌన్, గీసుగొండ, సంగం మండల కేంద్రాలలో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కేంద్రాన్ని ప్రారంభించాలని తెలిపారు. అలాగే గ్రామ, వార్డు స్థాయి పార్టీ పూర్తి కమిటీల నియామకం, ఫ్రంటల్ ఆర్గనైజేషన్ ఎన్నికల తీరుపై చర్చించారు.





# కరాటే మాస్టర్ దామెర శంకర్‌కు గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు లో చోటు

- అభినందనలు తెలిపిన సీపీ ఎన్.శ్వేత, ఐపీఎస్

**వరంగల్, ఆయుధం:** వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఆగస్టు 16వ తేదీన చెన్నైలో నిర్వహించిన కరాటే పోటీల్లో నిరవధికంగా ఆరు గంటల పాటు కరాటే ప్రదర్శన నిర్వహించి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించిన హనుమకొండ నయీమ్ నగర్ ప్రాంతానికి చెందిన కరాటే మాస్టర్ ధామేర శంకర్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపీఎస్ అభినందించారు. ఈ సందర్భంగా సీపీ శ్వేత మాట్లాడుతూ, కఠోర సాధన, పట్టుదలతో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి గిన్నీస్ వరల్డ్ రికార్డు సాధించడం అభినందనీయమని అన్నారు. ధామేరా శంకర్ సాధించిన ఈ ఘనత, రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు.

# ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి అవకాశాలు

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కందుకూరి పూజ




**హనుమకొండ, ఆయుధం:** ట్రాన్స్‌జెండర్ వ్యక్తులకు ఉపాధి అవకాశాలు కల్పిద్దాం అని వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కందుకూరి పూజ అన్నారు. మంగళవారం సుబేదారిలోని అసంత భవన్ నందు ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ, మోడరన్ అవేర్నెస్ సొసైటీ, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ వరంగల్ పోలీస్ కమిషనరేట్ సంయుక్తంగా ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి మానవ అక్రమ రవాణా నిర్మూలన, ట్రాన్స్‌జెండర్ హక్కుల పరిరక్షణ పైన అవగాహన కార్యక్రమాన్ని సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి కందుకూరి పూజ హాజరై మాట్లాడుతూ సమాజంలో ఇంకా ట్రాన్స్‌జెండర్ వ్యక్తులపైన వివక్షత కొనసాగుతుందని.. ఈ మధ్యకాలంలో నకిలీ టాన్స్ జెండర్స్ వలన ట్రాంజెండర్ కమ్యూనిటీకి చెడ్డ పేరు రావడం జరుగుతుందని కాబట్టి నిజమైన ట్రాన్స్‌జెండర్ వ్యక్తులు ఆ యొక్క నకిలీ ట్రంజెండర్ వ్యక్తులను గుర్తించి సమాజంలో గౌరవంగా ఉండేటట్లు చూడాలని కోరారు. అంతేకాకుండా ట్రాంజెండర్ వ్యక్తుల కొరకు ప్రభుత్వంలోని వివిధ పథకాల ద్వారా అందుతున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు మరి ముఖ్యంగా ట్రాంజెండర్ వ్యక్తులలో చదువుకున్న వారు అర్హత కలిగిన వారికి ఆయా ప్రభుత్వ శాఖలతో పాటు మిగతా సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వివిధ ప్రభుత్వ అధికారులకు సూచించారు.
సమాజంలో అనేక రకాలుగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సమాజం ట్రాంజెండర్ వ్యక్తులను ఆదరించి తగిన ఉద్యోగ అవకాశాలు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. కేవలము ఉద్యోగ అవకాశాలు కాకుండా ట్రాంజెండర్ వ్యక్తులు స్వయం ఉపాధి మార్గాలను నైపుణ్య శిక్షణలను పొంది సమాజంలో గౌరవపదమైన జీవితాన్ని గడపాలని కోరారు. ఎవరైనా మీకు ,మీ యొక్క హక్కులకు భంగం కలిగించినట్లయితే తప్పనిసరిగా జిల్లా న్యాయ సేవా సంస్థలను ఆశ్రయిస్తే తగిన సహాయ సహకారాలు అందించి అట్టి వ్యక్తులపైన చర్యలు తీసుకోబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్ ఇన్స్పెక్టర్ ట్రాంజెండర్స్ ప్రొటెక్షన్ సెల్ ఇన్చార్జి ఓ.రమేష్, జిల్లా సంక్షేమ అధికారి కే .విశ్వజా, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ, ట్రాంజెండర్ కమ్యూనిటీ నాయకులు లైలా, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎర్ర శ్రీకాంత్, యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్ ఎస్సైలు శ్రావణి, సుధాకర్, ఏ.ఎస్.ఐ.భాగ్యలక్ష్మి, కానిస్టేబుల్ రామారావు, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ కోఆర్డినేటర్లు ఇక్బాల్ పాషా, అజయ్ కుమార్, కె.రవి తదితరులు, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ట్రాన్స్ జెండర్, గే, శివశక్తి కమ్యూనిటీకి చెందిన సుమారు 160 మంది పాల్గొన్నారు.

# నకిలీ సందేశాలకు స్పందించవద్దు

- ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు.



**ములుగు, ఆయుధం:** తన పేరు, ఫొటోను ఉపయోగించి గుర్తుతెలియని వ్యక్తులు పంపుతున్న నకిలీ వాట్సాప్ సందేశాలకు ఎవరూ స్పందించవద్దని,ప్రజలు, అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన పేరు, ఫొటోను వాట్సాప్ డి.పి.లో పెట్టుకుని +66 98 476 2993 నంబర్ నుంచి అధికారులకు సందేశాలు పంపుతున్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ నంబర్ నుంచి వచ్చే సందేశాలను నమ్మవద్దని, వెంటనే సంబంధిత నంబర్‌ను బ్లాక్ చేసి, వాట్సాప్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. తన పేరు, ఫొటో కనిపించినంత మాత్రాన అపరిచిత నంబర్ల నుంచి వచ్చే సందేశాలను విశ్వసించవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాంటి సందేశాల ద్వారా డబ్బులు, బహుమతి కార్డులు అడిగినా స్పందించవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, రహస్య సంకేత సంఖ్యలను ఎవరికీ ఇవ్వవద్దని కోరారు. సైబర్ నేరగాళ్లు ప్రముఖుల పేర్లు, ఫొటోలను ఉపయోగించి ప్రజలను నమ్మించి మోసాలకు పాల్పడే అవకాశం ఉందని తెలిపారు. తన పేరుతో అనుమానాస్పద సందేశాలు వస్తే సంబంధిత సైబర్ నేరాల విభాగం పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇలాంటి మోసాల బారిన పడకుండా ప్రజలు, అధికారులు, సిబ్బంది జాగ్రత్త వహించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటన లో పేర్కొన్నారు.

# హక్కుల సాధన కోసం బిసిలంతా ఏకం కావాలి

- రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు

**వరంగల్, ఆయుధం;** బీసీల హక్కుల సాధనకు రాజకీయాలకతీతంగా బీసీ కులాలన్నీ ఏకం కావాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట రాములు అన్నారు. బీసీ హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా రెండవ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మండల కేంద్రమైన సంగెంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ప్రచార యాత్రను జండా ఊపి ప్రారంభించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ బీసీ హక్కుల సాధన సమితి సంగెం మండల నాయకులు బక్కం రాజు జున్ను సాంబయ్య వరంగల్ మండల అధ్యక్ష కార్యదర్శులు పరికరాల రమేష్ కట్కోజు చంద్రశేఖర్ లతో కలిసి బీసీ హక్కుల సాధన సమితి ప్రచార యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట్రాములు



మాట్లాడుతూ 1931లో బ్రిటిష్ ప్రభుత్వం చేసిన బిసి కులాల లెక్కలు తప్ప స్వాతంత్ర్యం వచ్చిన ఈ 80 ఏళ్లలో అధికారంలో ఉన్న అగ్రవర్ణాల రాజకీయ పార్టీల ప్రభుత్వాలు ఇంతతవరకు బీసీల కులాలను లెక్కలు తీసి బీసీల వాటా బీసీలకు ఇవ్వడానికి ముందుకు రావడం లేదన్నారు. 2021లో జరగవలసిన జనాభా లెక్కలు కరోనా కారణంగా వాయిదా పడిన దరిమిలా ఇప్పుడు చేపట్టిన జనాభా లెక్కలలో బీసీ కులగణను చేపడతామని ఎన్నోమార్లు హామీ ఇచ్చిన బిజెపి పార్టీ, నేడు బీసీల లెక్కలు తీయకుండా హిందువులలో ఉన్న 60 శాతం బీసీలకు సమన్యాయం చేయటం లేదన్నారు. విద్యా వైద్యంతో పాటు అన్ని ప్రభుత్వ రంగాలను ప్రైవేటు పరం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం తక్షణమే ప్రైవేటీకరణ ఆపి కేంద్రంలో ఖాళీగా ఉన్న పది లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. ఈ అగ్రకుల పార్టీల కుట్రలను ఇప్పటికైనా బీసీ కులాలు గమనించి రాజకీయాలకతీతంగా ఏకమై మన హక్కుల సాధనకు ఉద్యమించవలసిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకోవడానికి బీసీ హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా 2 వ మహాసభలు వరంగల్ పట్టణంలోని శివనగర్ రాజశ్రీ గార్డెన్ లో అక్టోబర్ 16న జరుగుతున్నాయన్నారు ఈ మహాసభలకు సంగెం మండలంలోని బీసీ కులాల యువత మేధావులు ఈ మహాసభలో పాల్గొని బీసీల భవిష్యత్తు కోసం జరిగే కార్యాచరణలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అటుకుల ప్రభాకర్, మెట్టుపల్లి స్వామి, రాములు, కొంరయ్య, మొగిళి, తదితరులు పాల్గొన్నారు.

# నేడు అవగాహన సదస్సు

- వాగ్దేవి కళాశాలలో పోటీ పరీక్షలపై ఉచిత అవగాహనా సదస్సు

**వరంగల్, ఆయుధం:** వాగ్దేవి డిగ్రీ & పీజీ కాలేజ్, సమీక్ష ఐఏఎస్ అకాడమీ, హైదరాబాద్, వారి సంయుక్త ఆధ్వర్యంలో UPSC సివిల్ సర్వీసెస్, TGPSC గ్రూప్1, గ్రూప్2 పోటీ పరీక్షలపై ఉచిత అవగాహనా సదస్సును ఈనెల 7న ఉదయం 10 గంటలకు వాగ్దేవి కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు సమీక్ష ఐఏఎస్ అకాడమీ చీఫ్ అకాడమిక్ డైరెక్టర్, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.గణేష్ ముఖ్య వక్తగా హాజరై విద్యార్థులకు మార్గదర్శనం చేయనున్నారు. కాకతీయ యూనివర్సిటీ ఈసీ మెంబర్ & ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డా.చిర్ర రాజు, వాగ్దేవి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ డా.ఎ.శేషాచలం, సమీక్ష ఐఏఎస్ అకాడమీ ఫౌండర్లు గంటా అనిల్ నాయుడు, నటరాజ్ పైడి, వాసు తదితరులు పాల్గొననున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఈ ఉచిత అవగాహనా సదస్సులో పాల్గొని నిపుణుల మార్గదర్శకత్వాన్ని సద్వినియోగం చేసుకోవాలని వాగ్దేవి కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి. కృష్ణమాచారి ఒక ప్రకటనలో తెలిపారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695